సిపిఎం జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహించిన కథల పోటీలో

ప్రథమ బహుమతి పొందిన కథ

# కదలిక





**బ**జారు ఉలిక్కిపడింది.

రోడ్లమీద, దుకాణాల్లో ఉన్న జనమంతా తలలు తిప్పి చూశారు.

వరుసగా బడి పిల్లలు ప్లకార్డులు ధరించి రెండు వరసల్లో వస్తున్నారు.

తొమ్మిదేళ్ళ నుంచి పదహారేళ్ళ దాకా ఉన్నారు పిల్లలు. బాలలే కాదు బాలికలూ పెద్ద సంఖ్యలో ఉన్నారు.

సుమారు రెండువందల పై చిలుకు బాలబాలికలు లాగి విడిచిన బాణాల్లా ఉత్సాహంతో కదను తొక్కుతున్నారు.

వారు ధరించిన అట్టలపై రాసిన రాతలు చూచి 'ఔరా' అనుకోకుండా ఉండలేకపోయారు జనం.

'విద్య మా హక్కు' 'మేం చదువుకుంటాం' 'మాకు టీచర్లు కావాలి'

"బాగానే ఉంది. వీళ్ళూ రోడ్డెక్కేశారు!" నినాదాలు చూసి వ్యాఖ్యానించారొకరు.

"పాపం వీళ్ళంతా ప్రభుత్వ హైస్కూలు స్టూడెంట్సండీ. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అయిదారు కిలో మీటర్లు నడిచీ, సైకిళ్ళ మీదా వస్తూంటారు. అంతా పేద సాదల పిల్లలే. వీళ్ళనీ వీళ్ళ చదువుల్నీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం నిజంగా దారుణమే" అన్నారింకొకరు.

"మేస్టార్లకి జీతాల లెక్కలూ ప్రైవేట్లూ సైడు బిజినెస్సులూ కావాలి గాని చదువులక్కర్లేదు. ఒక్కరూ టైముకు రారు. వచ్చినా తిన్నగా చెప్పరు. వాళ్ళ పిల్లల్ని మాత్రం ప్రైవేటు స్కూళ్ళలో ఎంచక్కా చదివిస్తుంటారు" అక్కసుగా అంది ఒకావిడ.

"వాళ్ళనేవిట్లే గవర్నమెంటు ఉద్యోగులంతా అలాగే ఉన్నారు. జనం కోసం మేం అనుకోవట్లేదు, మాకోసం జనం అనుకుంటున్నారు"

"ఢిల్లీ జనంలోలా మనలోనూ మార్పు రావాలండీ. అప్పుడే పాలకుల్లో ఉద్యోగుల్లో జవాబుదారీ తనం పెరుగుతుంది..."

"ప్చ్... తాటాకు చప్పుళ్ళకి కుందేళ్ళు బెదుర్తాయి గాని ఈ ప్రభుత్వాలు మేల్కోవు. వీటివల్ల ప్రయోజనం ఓ పెద్ద సున్న"

రకరకాల వ్యాఖ్యలు విమర్శలు అభిప్రాయాలు యధేచ్ఛగా విహరిస్తోంటే బజారు మధ్యలోని ముఖ్య రహదారి మీద విద్యార్థులు ఆగారు. ట్రాఫిక్ ఆగిపోయింది.

ఇద్దరు ట్రాఫిక్ కానిస్టేబుళ్ళు పరుగునొచ్చారు.

"ఇక్కడాగారేంటి? వెళ్ళండెళ్ళండి" ఒకడు లాఠీ ఝుళిపించాడు.

రెండోవాడు "బళ్ళోబుద్ధిగా చదువుకోక నడిరోడ్డు మీద ఈ న్యూసెన్సేవిటి" కోప్పడ్డాడు.

"చదువు కోసమే వచ్చాం. చదివించేవారు కావాలని వచ్చాం" పదిహేనేళ్ళ మల్లిక

ముందు కొచ్చి అంది.

"ఓహో. నువ్వు ఈ పిల్లకాయల లీడరువా! ఆడపిల్లవైనా వీళ్ళని బాగానే నడిపిస్తున్నావు గాని మీ గోస ఇక్కడ కాదు అధికార్ల దగ్గర చెప్పుకోండి. ఊ...కదలండి..."

"మా ఇబ్బందులు జనానికి తెలియాలి" అందా అమ్మాయి ఎలాంటి తొట్రుబాటు లేకుండా.

వెంటనే పిల్లలంతా నినాదాలందుకున్నారు.

"250 మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లా? సిగ్గు సిగ్గు!"

"చదువు మా హక్కు. దాన్ని మాకు ఇప్పించండి"

"వెంటనే టీచర్ల ఖాళీలు నింపాలి!"

"కాగితాల మీద విద్యాహక్కు ఇస్తే చాలదు, ఉపాధ్యాయుల్ని ఇవ్వండి"

పది నిమిషాలపాటు నినదించారు. పత్రికా విలేఖర్లొచ్చి వార్త రాసుకున్నారు. ఊరేగింపు ఫొటో తీసుకున్నారు.

"వీళ్ళ వాదన కరక్టే. చదివించే వాళ్ళకోసం చదువుకునే వాళ్ళు రోడ్డెక్కాల్సిరావడం బాధాకరమే" అన్నారొకరు బిగ్గరగా.

అతడి మాటల్తో ఏకీభవిస్తూ తప్పట్లు కొట్టారు ఎంతోమంది.

పిమ్మట విద్యార్థులంతా ఎమ్డీఓ ఆఫీసుకెళ్ళి బైఠాయించారు.

పిల్లజనాన్ని చూసి కంగారుపడ్డారు యమ్మీవో రాజారావు. ఆయన ప్రస్తుతం ఇన్చార్జి. ఎమ్డీవో కూడానూ. ఆయనింకో ఎనిమిది నెలల్లో రిటైర్ కాబోతున్నారు. ఈలోగా ఎలాంటి గొడవలూ జరక్కుండా పూర్తి పెన్షన్తో ప్రశాంతంగా రిటైరై పోవాలని ఆయన తాపత్రయం.

"ఏమయ్యా అసిస్టెంటూ, ఏంటి వాళ్ళగోల?"

"జెడ్పీస్కూల్లో శాంక్షన్డ్ పోస్టులు పన్నెండు. ఉన్నది ముగ్గురు. గత మూడేళ్ళ నుంచీ ఇదే పరిస్థితండి. టెన్తెలో సున్నా రిజల్ట్స్ వస్తున్న స్కూలు. రిజల్ట్స్ టైములో తప్ప మళ్ళీ ఆ స్కూలు ఊసు ఎత్తిన పాపాన పోరెవరూ..."

"పైవాళ్ళివ్వందే మధ్యలో మనమేం చెయ్యగలం?" ఎదురు ప్రశ్నించారు రాజారావు.

" డీఈఓకీ జెడ్పీ చైర్మాన్కీ కలెక్టరుకీ రాయటం వరకే మన పనండి..."

"అలా రాసేస్తామని చెప్పి పంపెయ్. మన మీద పడేకన్నా యమ్మెల్యే మీదో మంత్రిగారి ఇంటిమీదో పడితే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని నచ్చ చెప్పవోయ్"

"ఆ ముక్క మీరే చెప్పాలని పట్టుబడుతున్నారు. మీడియా కూడా వచ్చేసిందండి. వాళ్ళంతా మనవాళ్ళే అయినా అప్పుడప్పుడూ తోక లేపుతుంటారు. అవాకులూ చవాకులూ రాసేస్తే మింగుడు పడటం కష్టం..."

'ఏడుకొండల వాడా! ఈ గొడవలేవీ చిలికి చిలికి గాలివానై నా కొంప మీద పడకుండా చూడు తండ్రీ. ఇంకో 250 రోజుల పాటు చల్లగా చూస్తే చాలు హ్యాపీగా రిటైరైపోతాను' అని మనస్సులోనే దణ్ణం పెట్టుకుని ఆఫీసు బయటికొచ్చారు.

పిల్లల వాడిన మొహాలనీ ఆశగా అర్థింపుగా చూస్తోన్న వారి కళ్ళనీ చూసే సరికి రాజారావు గుండె పట్టేసింది.

ఏసీ బస్సులో ఇంటర్నేషనల్ స్కూల్‌కి వెళ్ళి, ఏసీ క్లాసురూంలో కూర్చుని చదువుకొనే మనవడు గుర్తొచ్చాడు. ఆయన నయనాలు చెమ్మగిల్లాయి. యమ్మీవో ప్రమోషన్ రాకముందు ఆయనా ఉపాధ్యాయుడే.

రాష్ట్రాన్ని సింగపూర్ని చేసేస్తాం, పాత భవనాలు కూల్చి ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తాం – అంటూ పెద్ద పెద్ద వాగ్దానాలు గుప్పించే నాయకులు, శాలువా కప్పిన ప్రతి సంస్థకీ సంఘానికీ కోట్లు కోట్లు ఇచ్చేస్తామని, అడగని వరాలు కూడా ఇచ్చేసే నాయకమ్మన్యులు జనం ప్రాథమికావసరాలని గుర్తించకపోవటం ఎంత సిగ్గు చేటు! ఎంత దౌర్భాగ్యం!

"పిల్లలూ! మీరిలా ర్యాలీ నిర్వహించకూడదు. మీ చదువు పాడవుతుంది. మీ భవిష్యత్తు పాడవుతుంది..."

"చదువు పాడయ్యిందనే వచ్చాం సార్..." మల్లిక ముందు కొచ్చి జవాబిచ్చింది.

ఆమె వంక తేరపారి చూశారు. పట్టుమని పదిహేనేళ్ళుండవ్. ఇంతమంది పిల్లల్ని కదిలించి ఒక్కత్రాటి మీద నడిపించుకొచ్చింది. ఆడపిల్లల్ని చదివించండి, బోల్డన్ని ఉచిత సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తూంటుంది. అలాంటిది స్కూల్లో సౌకర్యాల లేమి గురించి ఒక ఆడపిల్ల ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. కాదు నిలదీస్తోంది!

"మీ బాధ నేను అర్థం చేసుకోగలను. కాని పరిస్థితుల్ని మీరు అర్థం చేసుకోవాలి. ప్రభుత్వానికెన్నో సమస్యలుంటాయి. మీరే సర్దుకుపోవాలి. ఇంగ్లీషు టీచరు లేరనుకో..."

"నిజంగానే లేరండి..."

"అప్పుడేం చేయాలి? లెక్కల టీచర్తో నాలుగు ఇంగ్లీషు ముక్కలూ చెప్పించుకోవాలి..."

"లెక్కల టీచరూ లేరు సార్" ఒకబ్బాయి అరిచాడు.

"మరప్పుడు సైన్సు టీచర్ని రిక్వెస్ట్ చేసి...

"సైన్సు టీచర్ లేరు సార్" కోరస్‌గా చెప్పారు విద్యార్థులు.

బుర్ర గోక్కున్నారు "మరెవరున్నారు?"

"తెలుగు టీచర్, సోషల్ టీచర్, పీటీ సార్..."

ఒక్క క్షణం ఏం మాట్లాడాలో తోచలేదు. "మీకు సమస్యలున్నాయి. కాదనను. దానికోసం స్కూలు ఎగ్గొట్టి మీరిలా రాకూడదు. ఇలా ప్రదర్శన నిర్వహించకూడదు. మీ

పెద్దవాళ్ళకు చెప్పి పిటీషన్లు పెట్టించాలి. ఇది పెద్దవాళ్ళు చూడాల్సిన పెద్ద విషయం..."

కొందరు ముందుకొచ్చి తమ తల్లిదండ్రులకి చదువురాదని చెప్పారు.

"సరే సరే. సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారుగా. ఇక మేం పూనుకుంటాం. త్వరలోనే టీచర్లు వేసేట్టు చూస్తాం. మీరిహ స్కూలు కెళ్ళి బుద్ధిగా చదువుకోండి..."

"ఇంకో నాలుగు నెలల్లో టెన్త్ పబ్లిక్ పరీక్షలొస్తాయండి. ఎప్పట్లోగా టీచర్లని పంపుతారో చెప్పండి సార్..." నిలదీసింది మల్లిక. అవునవునంటూ తలలాడించారు పిల్లలు.

"కచ్చితంగా ఫలానా తారీఖు లోపల టీచర్లని అప్పాయింట్ చెయ్యగలమని చెప్పడం కుదర్దు. దీనికెన్నో అంచెలున్నాయి. ఇదో పరమ పద సోపాన క్రమం... అయినా చేస్తాం. ఇది వరకెప్పుడో మీ స్కూలుకి టీవీ ఇవ్వలేదూ? వీసీఆర్ ఇవ్వలేదూ? నిన్నగాక మొన్న కంప్యూటర్లు సప్లై చెయ్యలేదూ?"

"చేశార్సార్. టీవీ పాడయ్యింది. వీసీఆర్ ఎక్కడుందో తెలీదు. కంప్యూటర్లిచ్చారు గాని టీచర్నివ్వలేదు. అవి బూజు పట్టి ఓ మూలన పడి వున్నాయి. ఆడపిల్లలకు మరుగుదొడ్లు లేవు. మంచినీరు లేదు. ఇంకా చాలా చాలా లేవు సార్. అవన్నీ అడగడం లేదు. మాకు టీచర్ల నిచ్చి మాకు విద్య నేర్పించమని ప్రార్థిస్తున్నాం..." రుద్ధ స్వరంతో చెప్పి చేతులు జోడించింది మల్లిక. మిగతావాళ్ళూ చిట్టిపొట్టి చేతుల్తో దండాలు పెట్టారు. భగవంతుడి ముందు భక్తుల్లా నిలబడ్డారు.

రాజారావు కదలిపోయారు.

ప్రభుత్వం దగ్గర డబ్బులేక కాదు. చిత్తశుద్ధి లేదు. అంకిత భావం అసలే లేదు. అభివృద్ధి పనుల పేరిట ఎన్నెన్నో కోట్లు విడుదల చేస్తున్నారు! ఆ మధ్య తుఫానొస్తే పునర్నిర్మాణానికంటూ కోట్లు కోట్లు కేటాయించారు. కాని చేసింది తక్కువ బొక్కింది ఎక్కువ. అందులో తనకీ వాటా లేకపోలేదు. రేపు గోదావరి పుష్కరాలకి ఇవ్వబోయే వందలకోట్లలో ఎంత నొక్కేయొచ్చని అప్పుడే లెక్కలేసుకుంటున్నారు రాజకీయ నాయకులూ అధికార్లూ! ఈ విద్యార్థుల గురించి పట్టించుకుంటే ఏమైనా ఒరిగేట్టుంటే ఎప్పుడో గద్దలు వాలిపోయేవి! ప్చ్! కాలం చెడిపోయింది!

చిన్నగా నిట్టూర్చి, "ఒక్క నెలలో ఇద్దరు ముగ్గురు టీచర్లనైనా వేయించేట్టు చూస్తాను" హామీ ఇచ్చారు.

విద్యార్థుల కళ్ళు మెరిశాయి. దేవుడు వరమిచ్చినట్టు పొంగిపోయారు.

"యమ్యీవోగారు జిందాబాద్" అని నినాదాలు చేసి వెళ్ళిపోయారు.

వాళ్ళెళ్లేక "మనం ఏదో చెయ్యాలయ్యా" అన్నారు అసిస్టెంటుతో. తను పదవీ విరమణ చేసేలోపు ఇంచార్జి యమ్డీవోగా కొనసాగి, ఓ అయిదు లకారాలు వెనకేసుకోవడం లక్ష్యంగా పెట్టుకున్న ఆయన 'ఆ పసివాళ్లకేదో చెయ్యాలి' అని మరో పని నిర్దేశించుకున్నారు.

వెంటనే అవసరమైన వివరాలతో ఫైలు పంపారు. పిమ్మట రిమైండర్లూ వెళ్లాయి. డీఈవో ఆఫీసులోని సూపరిడెంటు నుంచి దేని గురించో ఫోన్ వస్తే ఆ సంగతి గుర్తు చేశారు.

"అదెక్కడ చిక్కుబడిందో మరి నా దగ్గరికి రాలేదు. వస్తే వెంటనే చూస్తాలే" అని చేతులు దులిపేసుకున్నాడాయన.

స్థానిక రిపోర్టర్లు వార్తనీ ఫొటోల్నీ పత్రిక కార్యాలయానికి పంపేరు గాని వాళ్లు ఆ ఏరియా టాబ్లాయిడ్‌లో నాలుగులైన్లు రాసి ఊరుకున్నారు. స్థానిక మంత్రిగారి విదేశీ పర్యాటన గురించీ, క్రికెట్ నుంచి తప్పుకొంటోన్న ఆ జిల్లా ఆటగాడి గురించీ, గోదావరి మీద షూటింగు జరుపుకొంటోన్న సినిమా గురించీ రాయడానికే పేపరంతా సరిపోయింది మరి!

మల్లిక ఇంట్లో మాత్రం పెద్ద గొడవే జరిగింది.

"మీ అమ్మాయి మా అమ్మాయినీ బజారుకి లాక్కెళ్ళింది. తగదునమ్మా అంటూ అందర్నీ వెంటేసుకుపోయింది. హవ్వ. నలుగురూ తప్పు పడుతున్నారు కాస్త మందలించి అదుపులో పెట్టండి" అన్నారామె తండ్రితో.

ఆ మరుక్షణం కళ్ళు మూసుకుని మల్లిక మీద పడ్డాడాయన.

"మగరాయుడిలా నువ్వెందుకు ముందుండాలే? బోల్డు మంది మగ పిల్లలున్నారుగా. వాళ్ళు చూసుకుంటార్లే. వాళ్ళకి లేని దురద నీకెందుకు ? నువ్వు కుదురుగా ఉండేట్టయితేనే స్కూలుకు వెళ్ళు, లేకపోతే చదువు మాని ఇంట్లో కూర్చో. ఊళ్ళో వాళ్ళ చేత నేను నానా మాటలూ పడలేను" కరాఖండీగా చెప్పేశాడు తండ్రి.

"అదికాదు నాన్నా. మాకు టీచర్లు లేరు. చదువు సాగట్లేదు. ఎంత మొత్తుకుంటున్నా ఎవరూ పట్టించుకోవట్లేదు...."

"అందుకని ఆడపిల్లవనీ, మరో ఇంటికి మెట్టాల్సిన దానివనీ మర్చిపోయి రోడ్డెక్కాలా?"

"చదువుకి ఆడామగా ఏంటి నాన్నా. చదువుల తల్లి సరస్వతి ఆడదే కదా. అయినా మేమేం గొడవ చెయ్యలేదు. బుద్ధిగా యమ్డీవో ఆఫీసు కెళ్ళి మహజరు ఇచ్చామంతే"

"నువ్వేదో ఇంత కాగితం ఇచ్చినంతమాత్రాన వాళ్ళేదే చేసేస్తారంటావ్. ఇక్కడ కాసుల్తో తప్ప కాగితాలతో పనులు జరగవు. పగటి కలలు కనడం మాని బుద్ధిగా పడుండు. ఇంకోసారలా అందర్నీ పోగేశావంటే కాళ్ళిరగ్గొడతాను జాగ్రత్త"

హతాశురాలయ్యింది మల్లిక. తను చేసిందానికి తండ్రి మెచ్చుకుంటారనుకుంది గాని ఇలా హెచ్చరిస్తారని ఊహించలేదు.

ఆమె కళ్ళ నీళ్ళు పెట్టుకుని చతికిలపడడం చూసి తల్లి జాలిపడింది. కూతురి పక్కన కూర్చుని తల నిమిరింది.

"మీ నాన్న మాటలు పట్టించుకోవద్దు. నువ్వు చేసిన పని చాలా మంచిది చిట్టి తల్లీ..."

"నాన్న..."

"నువ్వు మగ పిల్లాడి వయ్యుంటే నిన్ను భుజాల మీద కెక్కించుకుని తిప్పేవారు. ఆడపిల్లవవడంతో తాటాకులు కడతారేమోనని భయపడుతున్నారు..."

"పనికి మంచీ చెడూ ఉంటాయి గాని ఆడా మగా తేడాలుంటాయా అమ్మా?"

"ఈ మగాళ్ళ లోకంలో ఉంటాయమ్మా. నువ్వేం అధైర్యపడొద్దు. వెనుకడుగు వేయొద్దు. నాకు తెలుసు. నలుగురి కోసం నీలా అంతా నడుం కట్టలేరు. నువ్వు సాధిస్తావు తల్లీ..."

తల్లి మాటలకు నవ్యోత్సాహం వచ్చింది మల్లికకి.

రోజూ స్కూలుకి వెళ్ళీ వెళ్ళగానే ఇంచార్జి హెడ్మాస్టార్ని కలిసి "కొత్త ఉపాధ్యాయుల్ని నియమించారా సార్" అని వాకబు చేస్తోంది. మొదట 'రాలేదు' అన్నారు. తర్వాత్తర్వాత తల అడ్డంగా ఊపారు. ఈ మధ్య ఆమె కనిపించీ కనిపించగానే పెదవి విరుస్తున్నారు.

యమ్మీవో ఇచ్చిన గడువు దాటి నాలుగురోజులయ్యింది. పరిస్థితిలో మార్పులేదు. విద్యార్థుల ఉత్సాహం నీరు కారిపోయింది.

స్తోమతు గల వాళ్ళు ప్రైవేటు ట్యూషను వెదుక్కోసాగారు. కొందర్నేమో చదువుమాని పనికెళ్ళమని వారి తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారు.

తొమ్మిది, పది తరగతుల పిల్లల్ని సమావేశపర్చింది మల్లిక.

"మనం మళ్ళీ వెళ్ళి అడగాలి. ఈసారి పనయ్యేదాకా అక్కడే బైఠాయిద్దాం..."

విద్యార్థులు కలవరపడ్డారు. విద్యార్థినులు సగం మంది "మా ఇంట్లో కోప్పడతారు మేం రాము" అని మొహం మీదే చెప్పేశారు.

"ఇది నా ఒక్కదాని సమస్య కాదు. మనందరి సమస్య. మన చదువు సమస్య. మన పరీక్షల సమస్య. మన భవిష్యత్తు సమస్య..."

"ఏమైనా అయితేగియితే పెద్దవాళ్ళ వల్లనే అవుద్దంట. పిల్లల వల్ల ఏమీ కాదన్నారు మా నాన్న" ఒకబ్బాయి అన్నాడు.

"ఏ పెద్దవాళ్ళ వల్ల పనవుద్దో కనుక్కో వాళ్ళనే బ్రతిమాలదాం"

ఆ కుర్రాడు తలూపాడు.

"నారాయణ తాతని కలిస్తే?" ఇంకో అబ్బాయి అన్నాడు.

నారాయణ తాత స్వాతంత్ర్య సమర యోధుడు. ఎనభై ఏళ్ళుపైనే ఉంటాయి. ఆయనంటే అందరికీ ఎంతో గౌరవం. అభిమానం.

మల్లిక కళ్ళు మెరిశాయి. "ఇప్పుడెళ్ళి కలుద్దాం వస్తారా?"

ఓ నలుగురు ముందుకు రాగా వాళ్ళతో సైకిళ్ళ మీద నారాయణ తాత ఇంటి

కెళ్ళారు.

విషయమంతా సావధానంగా విన్నారాయన. వారు చేస్తున్న కృషిని అభినందించారు.

"ఎవరో వస్తారు ఏదో చేస్తారని ఎదురు చూస్తూ కూర్చోకుండా మీరంతా మీ పరిధిలో కృషి చేయడం బావుంది. మీ చైతన్యం నన్ను అబ్బుర పరుస్తోంది. సమస్యల్ని ఏకరువు పెట్టే వాళ్ళే ఎక్కువ. వాటికి పరిష్కారం వెదకాలని ఆలోచించరు. నిద్రాణమై ఉన్న సమాజాన్ని కదిలించడానికి పెను నిద్ర వదిలించడానికి మీరంతా పూనుకోవడం చాలా ఆనందంగా ఉంది. పది అంతస్తుల భవనమైనా పునాది పటిష్ఠంగా ఉంటేనే పది కాలాల పాటు నిలబడుతుంది. పాఠశాల స్థాయి నుంచీ చదువు సక్రమంగా సాగితేనే మీ భవిష్యత్తు బాగుంటుంది. మీలాగానే ప్రతి ఒక్కరూ రాజ్యాంగం ఇచ్చిన హక్కుల గురించి తెలుసుకోవాలి. అవి అమలు చేసేట్టు ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలి. వాళ్ళు తమ బాధ్యతల్ని గుర్తెరిగేలా చెయ్యాలి. అప్పుడే పాలకుల్లో మార్పు వస్తుంది. మీ వెంట మీ వెనుక నేనూ ఉంటాను. ఇవాళ మీది పీలగొంతే కావొచ్చు. రేపటికది శంఖనాదంగా మారితీరుతుంది..."

మల్లిక మిగతా పిల్లలూ పొంగిపోయారు. "మీరు ముందుండి మమ్మల్ని నడిపించండి తాతయ్యా"

"బాధ పడుతున్న వాళ్ళే ముందుండాలి. బాధితులే ముందడుగు వేయాలి. మీది సత్యాగ్రహం. ధర్మపోరాటం" అంటూ వీపు తట్టారు.

మర్నాడు విద్యార్థులందర్నీ స్కూల్లోకి వెళ్ళనివ్వకుండా గేటు దగ్గరే ఆపేశారు మల్లిక తదితరులు.

"నిన్న మేం నారాయణ తాతని కలిశాం. మనం చేసింది రైటేనన్నారు. వెనకడుగు వేయొద్దన్నారు. మనకి సపోర్టుగా వస్తానన్నారు. మనం నిరాశపడొద్దు. టీచర్లని వేసే దాకా స్కూల్లో అడుగు పెటొద్దు..."

మల్లిక మాటలకి కొందరు భయపడ్డారు. "హమ్మో–స్కూలు మానేస్తే టీచర్లు కొడతారు" అందో అమ్మాయి.

"ఎందుకొడతారు? మనమేమీ తప్పు పని చెయ్యట్లేదు. కావాలని స్కూలు ఎగ్గొట్టడం లేదు. స్కూలంటే దేవాలయమే. కాని మన ఈ దేవాలయంలో దేవుడు లేడు. దేవుణ్ణి ప్రతిష్ఠించమంటున్నామంతే. మనకి అండగా ఉండమని టీచర్లనీ కోరదాం..."

తప్పట్లు కొట్టారంతా.

మల్లిక ఆధ్వర్యంలో ఒక బృందం వెళ్ళి ఇంచార్జి హెడ్మాస్టారునీ మిగతా ఇద్దరు టీచర్లనీ కలిశారు. సహకారం అర్థించారు.

వాళ్ళు వెంటనే అంగీకరించారు.

"మన స్కూలుని జీరో పెర్సంటేజ్ స్కూల్ అని గేలిచేస్తున్నారు. అందుకు మాకూ సిగ్గుగానే ఉంది. ఎస్సెస్సీలో అలాంటి రిజల్ట్స్ ఎందుకొస్తున్నాయని ఎవరూ ఆలోచించడం లేదు. పట్టించుకోవటమూ లేదు. చదువు నేర్చుకొనేవారున్నా. నేర్పేవారే లేకపోవడం చిత్రమైన పరిస్థితే. చదువంటే పరీక్షలూ రిజల్ట్సూ సర్టిఫికేట్లూ మాత్రమే కాదు. చదువంటే విజ్ఞానం. వికాసం. భవిష్యత్తు. మీ బంగారు భవిత మట్టిపాలవుతోంటే చూస్తూ కూర్చోవడం గురువు లక్షణం కాదు. మేం మీతో చేతులు కలుపుతాం. పదండి..."

మరుక్షణం స్కూలు గేటుకి తాళం పడింది.

అంతా సుశిక్షిత సైనికుల్లా రెండు బారులుగా నడుస్తూ ఊరేగింపు తీశారు.

"చదువు మా హక్కు. చదువు నేర్పించండి"

'స్కూలు ఉంది. విద్యార్థులున్నారు. ఉపాధ్యాయులు లేరు. సిగ్గు సిగ్గు!'

'మా భవిష్యత్తుని బలి తీసుకోవడం దుర్మార్గం. రాక్షసత్వం!'

"ప్రభుత్వమూ ప్రజాప్రతినిధులూ కళ్ళు తెరవాలి"

"ప్రజలారా మా భవితకు చేతులడ్డు పెట్టండి"

వినూత్న నినాదాలతో బజారు ప్రతిధ్వనించింది.

జనం మళ్ళీ ఉలిక్కిపడ్డారు. 'పాపం వీళ్ళకింకా మాస్టార్లని వెయ్యలేదా' అనుకుని సానుభూతిగా చూశారు.

నారాయణ తాత కర్ర సాయంతో నడుస్తూ వచ్చి కలిసే సరికి అందరి ఉత్సాహం ద్విగుణీకృతమైంది.

"ప్రైవేటు విద్యాలయాలకీ, విదేశీ విశ్వ విద్యాలయాలకీ భారీ రాయితీలిచ్చే ప్రభుత్వం పేద మధ్య తరగతి పిల్లలు చదివే గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్ని నిర్లక్ష్యం చెయ్యడం దారుణం. ఈ ఘోరాన్ని వేలెత్తి చూపడం, సమస్య పరిష్కరించేలా ఒత్తిడి తీసుకురావడం మనందరి బాధ్యత"

నారాయణ తాత ప్రసంగం పౌరుల్ని ఉత్తేజ పరిచింది. కొందరొచ్చి కలిశారు.

అంతా యమ్డీవో ఆఫీసుకెళ్ళారు.

బయటి నినాదాలు చెవినబడే సరికి లంచ్ చేస్తోన్న రాజారావుకి పొలమారింది.

క్రితంసారి విద్యార్థులొచ్చి అడిగినప్పుడు ఆ వేడిలో ఏదేదో చేశారు. ఆ తర్వాత ఆ గొడవ మర్చిపోయారు. ఇంకో ఏడు నెలల్లో రిటైర్ కాబోతున్నారు. గనుక పెన్షన్ వెంటనే సెటిలవ్వడానిగ్గాను తను పని చేసిన అన్ని స్కూళ్ళనుంచీ ఆఫీసుల్నుంచీ సర్వీసు రికార్డులు తెప్పించుకునే పనిలో పడ్డారు. రిటైరైతే తన పని తన ఆఫీసువాళ్ళే పట్టించుకోరని ఆయన నిశ్చితాభిప్రాయం!

అసిస్టెంటుని పిలిచి ఆ ఫైలు ఏమయ్యిందో కనుక్కోమని ఆదేశించారు.

ఆఫీసు బయట విద్యార్థులంతా రోడ్డు మీదే బైఠాయించారు. ఎండ మండిపోతోంది. నేల కాలి పోతోంది. అయిదు నిమిషాలకే పిల్లలు కందిపోయారు. కన్నీటి పర్యంతమయ్యారు. నినాదాల జోరూ తగ్గింది. గొంతెండి పోతోంది.

సమీప వ్యాపారస్తులు మంచినీళ్ళూ మజ్జిగా తెచ్చిచ్చారు.

ఆఫీసులోంచి తొంగి చూట్టమే తప్ప ఉద్యోగులెవరూ బయటికి రాలేదు.

పిల్లల పరిస్థితి చూసి కదలిపోయారు నారాయణ తాత. వాళ్ళందర్నీ చెట్టు నీడలో కూర్చోమన్నారు.

టౌన్లోని ప్రతిపక్షనాయకులూ వివిధ యూనియన్ల నాయకులూ వచ్చి తమ సంఘీభావం తెలిపారు. ఉపన్యాసాలిచ్చారు. ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.

రాజారావు అన్ని అఫీసులకీ ఫోన్ చేశారు.

ఏ ఆఫీసులోనూ సదరు ఫైలు ఆచూకీ తెలీలేదు.

దాంతో విద్యార్థులకు మొఖం చూపించలేక లోపలే ఉండిపోయారు.

చీకటి పడింది. ఆ మర్నాడు తిన్నగా ఇక్కడికే వచ్చెయ్యాలని చెప్పుకుని వెళ్ళిపోయారు విద్యార్థులు.

మరుసటి రోజున విద్యార్థులంతా యమ్డీవో ఆఫీసు ముందు ప్రోగయ్యారు. చాలా మంది పిల్లల తల్లిదండ్రులూ వారి వెంట వారికి మద్దతుగా వచ్చారు. వారిలో మల్లిక తండ్రీ ఉన్నాడు.

కాస్సేపు నినాదాలిచ్చారు. పిమ్మట తొమ్మిది పదో తరగతి విద్యార్థులు చిన్న క్లాసుల వాళ్ళకి చెట్లకిందే పాఠాలు చెప్పడం మొదలెట్టారు.

యమ్డీవో ఆఫీసు ఆవరణంతా గురుకులంగా మారిపోయింది.

ప్రింటు మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వచ్చి వాలిపోయేసరికి రాజారావు కంగారుపడ్డారు.

టీచర్ల అప్పాయింట్‌మెంటుకి సంబంధించిన ఫైలు కదిలిందనీ, ఇక స్కూలు కెళ్ళిపోమనీ విద్యార్థులకు విజ్ఞప్తి చేశారాయన.

"స్కూలు కెళ్ళినా చేసేదేం లేదు కదా సార్. అది తెమిలే వరకూ ఇక్కడే ఉంటాం" అని మల్లిక జవాబిచ్చేసరికి కంగుతిన్నారు.

ఇదేదో కొంపకూల్చే వ్యవహారమేనని భయపడ్డారు. పిల్లలకీ పెద్దలకీ నచ్చ చెప్పాలని ఆయనా అఫీసోద్యోగులూ ప్రయత్నించారు గాని ఎవరూ మెత్తబడలేదు.

ఈలోగా వార్త టీవీలో ప్రసారమయ్యే సరికి ఆ సంఘటన గురించి రాష్ట్రమంతా తెలిసిపోయింది.

టీచర్లు లేని ఇతర ప్రభుత్వ స్కూళ్ళలోనూ అలజడి మొదలైంది. తాము కూడా

ధర్నాలు చెయ్యడానికి ప్రయత్నాలు మొదలెట్టారు. ప్రముఖులూ ప్రతి పక్షాలూ మద్దతిస్తామంటూ ముందుకొస్తున్నాయి.

అదో ఉద్యమంగా రూపుదిద్దుకోసాగింది.

ప్రాథమికావసరాలను గాలి కొదిలి ప్రభుత్వం ఆకాశానికి నిచ్చెన్లు వేస్తోందంటూ విమర్శలు చెలరేగాయి. అవి జడివానగా మారి ఉక్కిరి బిక్కిరి చేశాయి.

దాంతో ఆగమేఘాల మీద ఉత్తర్వులొచ్చేశాయి.

పరమానంద భరితులయ్యారు రాజారావు.

ఫ్యాక్స్ ఉత్తర్వుని విద్యార్థులకు చూపుతూ అన్నారు. "మీరంతా గెలిచినందుకు అభినందనలు. ఇద్దరు టీచర్లను మీ స్కూలుకి వేశారు. వారు రేపే వచ్చి జాయినవుతారు. అయిదుగురు విద్యా వాలంటీర్లను నియమించడానికీ అనుమతిచ్చారు. రేపుటెల్లుండ్లో నియమించేస్తాను. ఇక మీ ధర్నా విరమించెయ్యండి..."

విద్యార్థులంతా హర్షధ్వానాలు చేశారు. చిందులేశారు.

నారాయణ తాత ఇన్ని చాక్లెట్లు కొని తెచ్చి ఒకటి మొదటగా మల్లిక నోట్లో పెట్టి ఆశీర్వదిస్తూ అన్నారు–

"ఇవాల్టి నుంచి ఆడవాళ్ళనెవరైనా అబల అంటే వూరుకునేది లేదు. ఆమె శక్తి యొక్క మరో రూపం! మారు రూపం!"

అంతా మల్లికని అభినందనల్తో ముంచెత్తుతోంటే ఆమె వంక గర్వంగా చూశాడామె తండ్రి.

అంతటితో ఆగలేదు మల్లిక తండ్రినని గుండెలు పొంగించి మరీ చెప్పేడందరికీ.

*  *  *

**(ప్రజాశక్తి ఆదివారం 03-5-2015)**
**(కదలిక కథాసంపుటి-2016)**
**(కన్నడంలోకి అనువదించబడినది)**